04092024-DIS-04_Layout 1 9/4/2024 2:50 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

'బుల్డోజర్'కు సుప్రీం బ్రేక్

సత్వర న్యాయం పేరిట నిందితుల ఇండ్లను కూల్చివేయడం చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు సోమవారం ఇచ్చిన తీర్పు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు చెంపపెట్టు లాంటిదని చెప్పాలి. న్యాయం ముసుగులో జరిగే ఈ ప్రతీకార దాడులు చెల్లవని తేల్చిచెప్పింది. నిందితులపై నేరం రుజువైనప్పటికీ వారి ఇండ్లను కూల్చడం సరికాదని, ఏదైనా చట్టం ప్రకారమే జరగాలని స్పష్టం చేసింది. అంటే ఏదైనా చట్టం లేదా నిబంధన ఉల్లంఘించినట్టు రుజువైతేనే కూల్చాల్సి ఉంటుంది. అదీ ముందస్తుగా నోటీసు ఇచ్చి, న్యాయపరమైన రక్షణ పొందేందుకు వీలు కల్పించి, ఆ తర్వాతే బుల్డోజర్లు పంపాలని కోర్టు మార్గదర్శకాలు జారీచేసింది. ఇటీవల యూపీలో కోర్టు కేసులు, విచారణలు, శిక్షలు అనేవి లేకుండానే ఆగమేఘాల మీద బుల్డోజర్లను నిందితుల ఇండ్ల మీదకు నడిపించడం ఓ రివాజుగా మారిన సంగతి తెలిసిందే. హింసాత్మక, ఉగ్రవాద ఘటనలతో సంబంధమున్నదని ప్రభుత్వం భావించే వ్యక్తుల ఇండ్లే లక్ష్యమని యోగి సర్కార్ అంటున్నది. కానీ, వాస్తవంలో ఒక వర్గానికి చెందినవారే ఈ సత్వర న్యాయానికి బలైపోతున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విమర్శను తప్పించుకునేందుకు అప్పుడప్పుడు స్వపక్షీయుల ఇండ్లపైకి కూడా బుల్డోజర్లు నడిపారు. బుల్డోజర్ న్యాయం లేదా సత్వరన్యాయమని పిలిచే ఈ ప్రక్రియకు ఆద్యుడైన యోగిని 'బుల్డోజర్ బాబా' అని పిలవడం పరిపాటి అయింది.

యూపీ నుంచి ఈ ప్రమాదకర ధోరణి మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలకు పాకింది. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం నిందితునిగా పేర్కొన్న వ్యక్తి పేరు మీద కాకుండా ఇతరుల పేరు మీద నిర్మించిన ఇండ్లనూ కూల్చడం తీవ్ర విమర్శలకు గురైంది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఇటీవల క్లాస్‌మేట్‌ను కత్తితో పొడిచిన ఓ విద్యార్థి తండ్రికి చెందిన ఇంటిని కూల్చడం ఈ విపరీత ధోరణికి పరాకాష్ఠ. నిన్నటివరకు బీజేపీ పాలిత రాష్ట్రాలకు పరిమితమైన బుల్డోజర్ న్యాయం ఇప్పుడు కాంగ్రెస్ పాలిత తెలంగాణలోనూ ప్రత్యక్షమైంది. నిబంధనలకు విరుద్ధంగానో లేక నిషేధిత స్థలంలోనో కట్టారంటూ రేవంత్ సర్కార్ పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు నడపడం వివాదాస్పదమైంది. కాంగ్రెస్ జాతీయస్థాయిలో వ్యతిరేకిస్తున్న బుల్డోజర్ న్యాయాన్ని ఆ పార్టీకి చెందిన ఇక్కడి ప్రభుత్వం అమలుచేయడం విచిత్రం. బుల్డోజర్ న్యాయం బూటకమని, అదొక తమాషా లాగా తయారైందని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియంకా గాంధీ చేసిన విమర్శలు ఇంకా సీఎం రేవంత్ చెవులకు సోకలేదా లేక ఆయనలోని బీజేపీ మూలాలు బుల్డోజర్లు నడిపేలా చేస్తున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే రేవంత్ బుల్డోజర్ దూకుడుకు న్యాయస్థానంలో బ్రేకులు పడ్డాయి. లెక్కాపత్రం లేకుండా కూల్చివేతలు జరపడం చెల్లదని, ముందస్తు నోటీసులిచ్చి చట్టపరమైన పద్ధతిలోనే ముందుకుపోవాలని తెలంగాణ హైకోర్టు ఇటీవల తీర్పు చెప్పింది. బాధితులకు న్యాయపరమైన ఉపశమనం పొందే అవకాశం కల్పించాలని కూడా సూచించింది. ప్రభుత్వం ఇచ్చే కూల్చివేత ఉత్తర్వులను షోకాజ్ నోటీసులుగా పరిగణించాలని చెప్పడం గమనార్హం. ఇప్పుడు వేరే కేసులో సుప్రీంకోర్టూ అదే చెప్పింది.

చట్టం నేరస్థులను శిక్షించమంటుంది. అదీ సజావైన విచారణ తర్వాతే. అమాయకులైన కుటుంబసభ్యులను రోడ్డు మీదకు తేవడం చట్టవిరుద్ధమే కాదు, న్యాయవిరుద్ధమని ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. రాజ్యాంగం కల్పించిన న్యాయపరమైన హక్కులను ప్రభుత్వమే హరించి వేయడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. చట్టాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలే దానిని ఉల్లంఘించడంగానే దీన్ని పరిగణించాల్సి ఉంటుంది. న్యాయప్రక్రియ పట్ల ప్రభుత్వాల అపనమ్మకాన్ని, వ్యతిరేకతను ఇది సూచిస్తున్నది. న్యాయవ్యవస్థలో పద్ధతి ప్రకారం పోవాలంటే ఎంతో కొంత జాప్యం తప్పనిసరి. అది తాత్కారంగా పరిణమించి, బాధితులు కృంగి, కృశించిన తర్వాత న్యాయం చేయడం సరికాదు. ఆలస్యంగా జరిగే న్యాయం అన్యాయమే అనే నానుడు అందుకే వచ్చింది. దానికి పూర్తి భిన్నమైన సత్వరన్యాయం కూడా అన్యాయమే అనేది సర్వోన్నత న్యాయస్థానం తీర్పు సారాంశం.

ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి!

గతేడాది చివరన రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థాపిస్తామని, 25 ఎకరాల విస్తీర్ణంలో మినీ ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటించింది. ఇందుకు రూ.500 కోట్లు కేటాయించి పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్, మధిర నియోజకవర్గాలను ఎంపిక చేసుకున్న విషయం తెలిసిందే.

కె.వేణుగోపాల్
98665 14577

యంగ్ ఇండియా నైపుణ్యాభివృద్ధి విశ్వవిద్యాలయం పేరుతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మరో కొత్త విద్యాసంస్థను ప్రారంభించడానికి శంకుస్థాపన చేసింది. ఈ సంస్థ పరిశ్రమలు, ఐటీ సంస్థలకు అనువైన నిపుణులను అందించనున్నదని సీఎం రేవంత్ ప్రకటించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ పేరుతో క్రీడా యూనివర్సిటీని ప్రారంభించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, ఈ వర్సిటీ ద్వారా వచ్చే ఒలింపిక్స్‌లో భారత్‌కు పెద్ద సంఖ్యలో పథకాలు వచ్చేలా క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంచే చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం చెప్తున్నది.

నిజానికి రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలున్నాయి. వాటిలో 28 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త విద్యాసంస్థల అవసరం ఉన్నదా? పాత పాఠశాలల్లోనే అధునాతన వసతులు కల్పించి, ఉపాధ్యాయులను నియమించి విద్యను పటిష్ఠం చేస్తే సరిపోతుంది కదా? అనే చర్చ ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్నది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కొత్త సంస్థల వైపే మొగ్గు చూపుతున్నది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను ప్రోత్సహించడం, అందుకు కావలసిన ఏర్పాట్లు చేయడం, వ్యాయామ ఉపాధ్యాయులను నియమించడం వంటి చర్యలు తీసుకోకుండా, యూనివర్సిటీ స్థాపించి తద్వారా క్రీడా నైపుణ్యాలను పెంచుతామనడం ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి ఎగిరిన చందంగా ఉన్నది. రాష్ట్రంలో 52 శాతం మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లోనే విద్యనభ్యసిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ విద్యాసంస్థల్లో క్రీడా సౌకర్యాలను పెంచేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. క్రీడా మైదానాల్లేని అపార్ట్‌మెంట్‌లలో, క్రీడా ఉపాధ్యాయుల్లేని ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల క్రీడా నైపుణ్యాలు ఏ రకంగా అభివృద్ధి చెందుతాయో ఆలోచించాలి. పీఎంశ్రీ పేరుతో కేంద్రం దేశవ్యాప్తంగా 14,500 పాఠశాలలకు నిధులు ప్రత్యేకంగా మంజూరు చేస్తూ మిగతా పాఠశాలలకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు తగ్గించింది. అంతే కాదు, గిరిజన ప్రాంతాల్లో అప్పటికే ఉన్న గిరిజన పాఠశాలలకు అదనపు కేటాయింపులు చేస్తూ వాటిని అభివృద్ధి చేయాల్సిన కేంద్రం ఏకలవ్య పాఠశాల పేరుతో కొత్తగా పాఠశాలను ప్రారంభించింది. కస్తూర్బా గాంధీ విద్యాలయం (కేజీబీవీ) పేరుతో డ్రాపౌట్ బాలికల కోసం శాశ్వత భవనాలతో మండలానికో పాఠశాలను ప్రారంభించింది. తర్వాతి కాలంలో రెగ్యులర్ బాలికలను కూడా చేర్చుకుంటూ పోవడంతో అది మరో గురుకులంగా మారిపోయింది. అందులో పనిచేసే మహిళా ఉపాధ్యాయులకు కాంట్రాక్టు పద్ధతిలో తక్కువ వేతనాలు ఇస్తూ, చట్టబద్ధంగా వెట్టిచాకిరి చేయిస్తున్నారు. వీరికి ఉద్యోగ భద్రత గాని, ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు గాని లేవు.

రాష్ట్రంలోని 11 విశ్వ విద్యాలయాలకు ఈసారి రాష్ట్ర బడ్జెట్లో కేటాయించిన నిధులు రూ.500 కోట్లు మాత్రమే! మొత్తం వర్సిటీల్లో 1800 బోధన సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీసీ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి! 5 వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు బోధన సిబ్బంది లేని కారణంగా ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో చేరడానికి వెనుకంజ వేస్తున్నారు. వారు ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలను ఆశ్రయిస్తున్నారు. జాతీయస్థాయి ర్యాంకుల్లో తెలంగాణ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు బాగా వెనుకబడ్డాయి. వందేండ్లకు పైగా చరిత్ర ఉన్న ఓయూ, సాంకేతిక విద్యలో రాష్ట్రానికే తలమానికంగా నిలిచే జేఎన్‌టీయూ ర్యాంకులు పడిపోయాయి. ఈ సంస్థల్లోని ప్రవేశాలు, కోర్సుల్లో నాణ్యత, ప్లేస్‌మెంట్స్, ఆర్థిక వనరులు, పరిశోధనకు వెచ్చించే నిధులు, లైబ్రరీ, కొత్త ప్రయోగశాలల ఏర్పాటు, వర్క్‌షాప్‌ల నిర్వహణ ప్రామాణికంగా తీసుకొని ర్యాంకులను నిర్ధారిస్తారు. ఇవన్నీ గమనిస్తే విద్యారంగానికి బడ్జెట్లో నిధుల కోత వల్ల ప్రమాణాలు క్షీణిస్తున్నాయని అర్థమవుతున్నది. ఈసారి కేంద్ర బడ్జెట్‌లో కూడా యూజీసీకి 60.99 శాతం బడ్జెట్‌ను తగ్గించింది. దీని ప్రభావంతో మన వర్సిటీలకు వచ్చే గ్రాంట్లలో పెద్ద ఎత్తున కోత పడనున్నది. ఈ పరిస్థితులన్నీ విశ్లేషించి విద్యారంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించాల్సిన కొత్త ప్రభుత్వం కొత్త విద్యాసంస్థల స్థాపనకు మొగ్గు చూపడం శోచనీయం.

ఇదిట్లా ఉంటే ఏటా లక్ష మంది విద్యార్థులు ఇంజినీరింగ్ డిగ్రీలు పొందుతుండగా 10 శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు వస్తున్నాయి. వీరికి నైపుణ్యాలు నేర్పించి సొంత అంకురసంస్థలు స్థాపించడానికి అవసరమైన కోర్సులను అందించేందుకు యంగ్ ఇండియా నైపుణ్యాభివృద్ధి విశ్వవిద్యాలయం స్థాపించనున్నారు. విద్యార్థుల నైపుణ్యాల లేమికి నిధులు, అధ్యాపకుల కొరత కారణమైతే, దాన్ని వదిలేసి, కొత్తగా నైపుణ్యాల కోసం వర్సిటీలను స్థాపించడం ఎందుకో అంతుచిక్కడం లేదు. ఇదంతా ప్రైవేటు భాగస్వామ్యంతోనే జరుగుతుంది. వారికి కావలసిన మానవ వనరులను ప్రభుత్వ సహాయంతో వారే సమకూర్చుకొని, వారి పరిశ్రమల్లో ఉద్యోగులుగా చేర్చుకుంటారు. అంటే, మన విశ్వవిద్యాలయాలు సమాజ అవసరాలకు కావలసిన మానవ వనరులను తయారుచేసే లక్ష్యాన్ని వదిలేసి, సామాజిక అవసరాలతో సంబంధం లేకుండా పని చేయనున్నాయన్న మాట. అంటే ప్రభుత్వాలు కార్పొరేట్, పెట్టుబడిదారుల అవసరాలకనుగుణంగా మన విద్యార్థులను రూపొందించే విధానాలకు రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలుకుతున్నదన్న మాట.

(వ్యాసకర్త: పూర్వ అధ్యక్షులు, ఏపీటీఎఫ్)

అదెలా సాధ్యం..!

సెబీ చీఫ్ మాధబి బుచ్ ఐసీఐసీఐలో ఉన్నప్పుడు ఆమె సగటు వార్షిక వేతనం రూ.1.30 కోట్లు. అయితే తరువాత పింఛన్, ఇతర రిటైర్‌మెంట్ బెనిఫిట్ల కింద ఆమె ఏడాదికి సగటున రూ.2.77 కోట్లు అందుకున్నారు. ఐసీఐసీఐలో ఉన్నప్పుడు ఆమె అందుకున్న వేతనం కంటే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఎక్కువగా ఉండటం ఎలా సాధ్యపడుతుంది? ఈ ఆరోపణలపై సెబీ స్పందించి వివరణ ఇవ్వాలి. - పవన్ ఖేడా, కాంగ్రెస్ నేత

అన్యాయంపై జయకేతనం

కాసర్ల నాగేందర్‌రెడ్డి

'తెలంగాణ బతుకమ్మ'గా పేరుగాంచిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఢిల్లీ మద్యం పాలసీ కేసులో భాగంగా ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చిన విషయం తెలిసిందే. కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)లు కేవలం అభియోగాలను కేంద్రంగా తీసుకొని ఆమెను 2024, మార్చి 15న అరెస్టు చేసి జైలుకు తరలించాయి. అయితే ఐదున్నర నెలలు గడిచినా ఈ కేసులో సదరు దర్యాప్తు సంస్థలు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు రుజువు చేయకపోవడంతో దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు బాధితురాలైన ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరుచేసింది.

సుప్రీం ఇచ్చిన ఈ తీర్పుతో ప్రజలకు న్యాయస్థానాలపై నమ్మకం మరింత పెరిగింది. అన్యాయంపై న్యాయం గెలిచిందంటూ ప్రజలు హర్షధ్వానాలు వ్యక్తం చేస్తుండటమే ఇందుకు తాజా నిదర్శనం. ఈ నేపథ్యంలో గత పదేండ్లుగా దేశంలో జరిగిన కొన్ని సంఘటనలను మననం చేసుకుందాం. సుదీర్ఘ కాలం తర్వాత 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆది నుంచి ఒంటిత్తు పోకడలతో వ్యవహరిస్తున్నది. 'మేము చెప్పిందే వేదం' అంటూనే రాష్ట్ర ప్రభుత్వాలపై తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ వస్తున్నది. 2019లో ప్రజలు మరోసారి ఆ పార్టీకి అధికారం కట్టబెట్టడంతో ఇక బీజేపీకి పట్టపగ్గాల్లేకుండా పోయాయి. కేంద్రంలోనే కాదు, రాష్ట్రాల్లోనూ తమ పార్టీనే చక్రం తిప్పాలనుకున్న దురాశతో ప్రజలు తిరస్కరించిన రాష్ట్రాల్లోనూ బీజేపీ జెండాను నిలబెట్టేందుకు ఆ పార్టీ పెద్దలు కుయుక్తులు పన్నారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చుతూ వచ్చారు. తాము చెప్పినట్టు విన్న నాయకులకు డబ్బులు ఎరగా చూపిస్తూ, లొంగని నాయకులపై కేంద్ర ప్రభుత్వం తమ అనుంగు దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఐటీలను ఉసిగొల్పింది. కొందరు నాయకులను ఉదాహరణకు తీసుకున్నటయితే... పశ్చిమబెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ నేత సువేందు అధికారిని శారద మల్టీ లెవల్ మార్కెట్ కుంభకోణంలో విచారణ పేరిట వేధించింది. ఈ వేధింపుల నుంచి విముక్తి లభించాలంటే బీజేపీలో చేరాలంటూ సంకేతాలు పంపింది. 2014 నుంచి వేధింపులు ఎదుర్కొన్న ఆయన ఆఖరికి 2020లో బీజేపీలో చేరారు. ఆ తర్వాత ఆ కేసు ఊసే లేదిప్పుడు. మరో మహారాష్ట్ర కాంగ్రెస్ నేత నారాయణ్ రాణేపై మనీ లాండరింగ్ కేసులో ఈడీ తీవ్ర వేధింపులకు గురిచేసింది. దీంతో ఆయన కూడా కాంగ్రెస్‌ను వదిలి బీజేపీకి మద్దతు పలికారు. అంతే ఈడీ దర్యాప్తుకు బ్రేక్ పడింది. అసోం సీఎం హిమంత బిశ్వదీ అదే కథ. ఆయన కూడా శారద కుంభకోణంలో నిందితుడు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన కొద్ది కాలానికే 2014లో బిశ్వ ఇంటిపై సీబీఐ దాడులు చేసింది. బీజేపీ నుంచి తాను ఎలాంటి వేధింపులను ఎదుర్కోవాల్సి ఉంటుందో ముందే గ్రహించిన బిశ్వ 2015లో బీజేపీ తీర్థం పుచ్చు కున్నారు. అంతే వాషింగ్ పౌడర్ నిర్మా వాడినట్టే ఆయనపై అవినీతి మరకలు మాయమయ్యాయి. ఇట్లా.. గత పదేండ్లుగా దారికి వచ్చిన నేతలకు తమ పార్టీ కండువా కప్పుతూ, ధిక్కరించిన నాయకులపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ పైశాచికానందాన్ని పొందుతున్నది. ఇందులో భాగంగానే ఢిల్లీ మద్యం పాలసీ విధానంపై కేసు తెరపైకి వచ్చింది.

> **దేశమంతా ఏకచ్ఛత్రాధిపత్యంతో దూసుకుపోతున్న బీజేపీకి ఇటు ఢిల్లీలో, అటు తెలంగాణలో అడ్డంకులు ఎదురయ్యాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, నాడు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కొరకరాని కొయ్యలా మారారు. వీరిని అడ్డు తొలగించుకోవాలన్న కేంద్ర ప్రభుత్వం తన పంజరంలో ఉన్న చిలకలైన దర్యాప్తు సంస్థలను పావుగా వాడుకున్నది.**

ఈ రెండు ప్రభుత్వాలు ఎప్పుడు దొరుకుతాయా అని కాచుకు కూర్చున్న దర్యాప్తు సంస్థలకు ఢిల్లీ మద్యం పాలసీ కనిపించింది. ఎక్సైజ్ మంత్రిగా సిసోడియా, సౌత్ గ్రూప్‌గా పేరుబడ్డ మద్యం వ్యాపారులకు ఆర్థికంగా ఇచ్చిపుచ్చుకునే లావాదేవీలకు పాల్పడ్డారనీ, తద్వారా మద్యం వ్యాపారుల నుంచి వందకోట్లకు పైగా ముడుపులు తీసుకున్నారని కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆరోపణలు చేశాయి. కేసీఆర్ కుమార్తె అయిన కల్వకుంట్ల కవితపైనా ఇదే కేసులో, ఈ రకమైన ఆరోపణలే చేశాయి. అందులో భాగంగా ఆమెను 2024, మార్చి 15న అరెస్టు చేసి జైలుకు తరలించాయి. అయితే ఐదున్నర నెలలు గడిచినా ఒక్క ఆధారం చూపెట్టకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఈ అరెస్టు ఉద్దేశపూర్వకంగా చేసిందనే విషయం దేశ ప్రజలకు అర్థమైపోయింది.

బీఎల్ సంతోష్ నేతృత్వంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కుట్రను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ భగ్నం చేసిన తీరు బీజేపీని దేశవ్యాప్తంగా దోషిగా నిలబెట్టింది. అందుకే కేసీఆర్‌పై ప్రతీకారం తీర్చుకోవాలనే కసితోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టుకు పాల్పడింది. అయితే... అసమాన ప్రతిభా పాటవాలు, అద్భుత వ్యక్తిత్వం ఉన్న ధీరవనిత, తెలంగాణ బతుకమ్మ అయిన కవితను ఈ అక్రమ అరెస్టులు అడ్డుకోవనే విషయం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అర్థం కాకపోవడం శోచనీయం. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గత నెల 27న రాత్రి 9 గంటల ప్రాంతంలో జైలు నుంచి విడుదలైన అనంతరం చెమర్చిన కండ్లతో 'జై తెలంగాణ' అంటూ నినాదాలు చేశారు. 'ఐదున్నర నెలల నా ఈ పరిస్థితికి కేవలం రాజకీయాలే కారణం. వాటివల్లే నన్ను జైల్లో వేసినట్లు దేశం మొత్తానికి తెలుసు' అంటూ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కవిత వ్యాఖ్యలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

చివరగా చెప్పేదేమంటే... సీబీఐ, ఈడీ, ఐటీ అనే దర్యాప్తు సంస్థలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉంటాయన్నది వాస్తవమే, అయినా ఆ సంస్థలు తమ పనితీరులో స్వతంత్రంగా, స్వయం ప్రతిపత్తిగా వ్యవహరించాలి. అంతేకానీ, కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి సెల్యూట్ కొట్టి 'ఎస్' బాస్ అన్నట్లుగా వ్యవహరించకూడదు. ఈడీ, సీబీఐ, ఐటీ దర్యాప్తు సంస్థల అధిపతులపైనా సుప్రీంకోర్టు ప్రత్యేక దృష్టిసారించాలి. రాజకీయాలకతీతంగా వీరిని నియమించాలి. అప్పుడే ఈ సంస్థలు ఎవరికీ తలవంచకుండా, ఎవరిపట్లా పక్షపాతం వహించకుండా వ్యవహరిస్తాయి. ప్రజాస్వామ్య పరిధిలో పనిచేస్తాయి. ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును కొట్టిపారేసిన సుప్రీంకోర్టు... 'ఉన్నత చదువులు చదివారనో, ఉన్నత స్థానాల్లో ఉన్నారనో, ఎమ్మెల్యే, ఎంపీ హోదా కలిగి ఉన్నారనో మహిళలకు సెక్షన్ 45(1) కింద ఉన్న ప్రయోజనాలను తిరస్కరించాలని చెప్పలేద'ని పేర్కొనడం కొసమెరుపు.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ ఆస్ట్రేలియా విభాగం అధ్యక్షుడు)

లేఖ

రీలింక్విష్‌మెంట్‌ను పునరుద్ధరించాలె

ఒక అభ్యర్థి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఉద్యోగాలకు ఎంపికై, తనకు నచ్చిన ఉద్యోగాన్ని ఎంపిక చేసుకొని, మిగతా ఉద్యోగాలను తిరస్కరించడాన్నే 'రీలింక్విష్‌మెంట్' విధానం అంటారు. టీఎస్‌పీఎస్‌సీలో 2022 వరకు కొనసాగిన ఈ విధానాన్ని ఆ తర్వాత తొలగించారు. 6 (ఏ) నిబంధనను పునరుద్ధరించి టీజీపీఎస్సీ 'రీలింక్విష్‌మెంట్' విధానాన్ని మళ్లీ అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఉద్యోగ నోటిఫికేషన్లన్నీ ఒకేసారి విడుదలవుతుండటంతో, పోటీ పరీక్షలు కూడా వరుసగా జరిగే అవకాశాలుంటాయి. దీంతో ఒకే అభ్యర్థికి ఒకటి, లేదా అంతకంటే ఎక్కువ ఉద్యోగాలు వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

ఇటీవల జరిగిన గురుకుల నియామకాల్లో అన్ని సొసైటీలు కలుపుకొని 3 వేల పైచిలుకు ఉద్యోగాలు బ్యాక్‌లాగ్ పోస్టులుగా మిగిలిపోయాయి. అంటే 3 వేల మంది అభ్యర్థులు ఉద్యోగాలను కోల్పోయినట్టే కదా? అంటే, 'రీలింక్విష్‌మెంట్' ప్రభావం ఏ మేర ఉన్నదో దీన్నిబట్టే అర్థమవుతున్నది. ఒకే అభ్యర్థికి రెండు, మూడు ఉద్యోగాలు రావడం వల్ల ఎంతో మంది నిరుద్యోగ అభ్యర్థులు ఒకటి, అరా మార్కులతో ఉద్యోగాలకు దూరమవుతున్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకొని అన్ని నియామక సంస్థల్లో 'రీలింక్విష్‌మెంట్' విధానం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఆ తర్వాతే ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్లను విడుదల చేయాలి. అప్పుడే నిరుద్యోగులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుంది.

- మఠం శివానంద స్వామి
(గ్రూప్-1 అభ్యర్థి, నారాయణఖేడ్)

ఎస్సీ ఉపకులాల వాటా ఏది?

బైరి వెంకటేశం మోచి
94919 94090

రాజ్యాంగబద్ధంగా అందాల్సిన ప్రయోజనాల కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న దళిత ఉపకులాలకు ఊరటనిస్తూ స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దవీందర్ సింగ్ కేసులో ఆగస్టు ఒకటిన భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 6:1 నిష్పత్తితో తీర్పు ఇచ్చింది. ఎస్సీ వర్గీకరణకు పరిష్కారం చూపుతూ 'ఆఖరి మనిషి ఆవేదనే వర్గీకరణకు పునాది కావాల'నే తలంపుతో దళితుల్లో అత్యంత వెనుకబడిన వర్గాలకే మొదటి ప్రాధాన్యం దక్కాలని స్పష్టంచేసింది. వీరిని ప్రత్యేక క్యాటగిరిగా గుర్తించి సముచిత రిజర్వేషన్లు కేటాయించాలని తీర్పునిచ్చి నిరుపేద దళిత కులాలకు అండగా నిలిచింది.

సామాజిక అణచివేతకు, వివక్షకు గురైన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కే రిజర్వేషన్లు. అయితే ఈ దేశంలో అట్టడుగు స్థానంలోఉండి, సామాజిక వివక్ష, అణచివేతకు గురవుతున్న దళిత వర్గాల్లోనూ అంతర్గతంగా అసమానతలుండటం బాధాకరం. ఒకే జాతి అనే సాకుతో దళితుల్లోని ఒకటి, రెండు కులాలే ఇప్పటివరకు మొత్తం రిజర్వేషన్ ఫలాలను అనుభవిస్తూ వస్తున్నాయి. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ఈ అన్యాయానికి ఇకపై అడ్డుకట్ట పడనున్నది.

తెలంగాణలో మొత్తం 59 దళిత కులాలున్నాయి. ఈ కులాల సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు వేర్వేరు. వీటిలో ఏ ఒక్క కులం కూడా మరో కులానికి ఉపకులం కానే కాదు. కానీ, సమాజంలో మాత్రం దళితులు అంటే మాల, మాదిగలు మాత్రమే అనే ప్రచారం ఉన్నది. ఈ కులాల జనాభా అధికంగా ఉండటమే అందుకు ప్రధాన కారణం. అంతేకాదు, విద్య, ఉద్యోగ, రాజకీయం సహా అన్ని రంగాల్లోనూ ఈ కులాలే అభివృద్ధి చెందాయి. మాల, మాదిగలతో పాటు మోచి, చిందు, డక్కలి, హోలియదాసరి, మష్టిన్, బైండ్ల, కొలుపుల, సమగర, బేడ(బుడగ) జంగం తదితర మరో 57 కులాలు కూడా దళిత వర్గానికి చెందినవే. చేతివృత్తులు చేస్తూ, సంచార జీవనం సాగిస్తున్న ఈ కులాలవారు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మాల, మాదిగలతో పోలిస్తే అత్యంత వెనుకబడి ఉండటం గమనార్హం.

> **2014లో అప్పటి బీఆర్ఎస్ సర్కార్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం.. తెలంగాణలో దళితుల జనాభా 64.44 లక్షలు. రాష్ట్ర జనాభాలో ఇది సుమార